క్లుప్తంగా

తగ్గించిన జీఎస్టీపై అవగాహన



పెనమలూరు: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 తగ్గింపుపై తాడిగడప మున్సిపాలిటీలో విస్తృత ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం జిమ్‌లు, సెలూన్‌లు, యోగా సెంటర్లలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మున్సిపాలిటీ సిబ్బందితో పర్యటించారు. జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారని స్థానికులకు వివరించారు. తగ్గిన జీఎస్టీపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ షేక్ నజీర్, అసిస్టెంట్ కమిషనర్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీ స్కూల్‌తో ప్రయోజనం



పెనమలూరు: అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్స్ వలన చిన్నారులకు చాలా ఉపయోగం ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. వణుకూరు గ్రామంలో సోమవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో తక్కువ ఖర్చుతో చిన్నారులకు ప్రీ స్కూల్స్‌లో విద్యా బోధన చేస్తారన్నారు. చిన్నారులకు ఆటపాటలతో చదువు చెప్పటం వలన మంచి ఫలితాలు వస్తాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో నేర్పించే విద్య వివరాలు వాట్సాప్ గ్రూపుల ద్వారా పంపుతామన్నారు. చిన్నారులకు గృహాలలో ఉండే ప్రతి వస్తువు వివరాలు తెలిపి అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ మహిళా సంరక్షణ కార్య దర్శి ఎం.సంఘమైత్రి, గర్భిణులు, తల్లు లు, చిన్నారులు,అంగన్‌వాడీకార్యకర్తలు పాల్గొన్నారు.

హైస్కూల్ కరస్పాండెంట్‌కు సత్కారం



గన్నవరం రూరల్: ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి విజయవాడలో నిర్వహించిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంలో ముస్తాబాద నవభారత్ హైస్కూల్ కరస్పాండెంట్ షేక్ ఇమాం అప్సా ఐకాన్ అకడమిక్ ఎచీవర్ అవార్డును అందుకున్నారు. సోమవారం ఇమాంను స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

'మానవత' చేయూత



గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు జీనస్‌గ్రేస్ లెప్రసీ కాలనీలో సోమవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిగ్రస్తులకు చెప్పులు, సెల్ఫ్ కేర్ కిట్‌లను పంపిణీ చేశారు. లెప్రాసొసైటీ ప్రతినిధి మామిడి రాధిక, కుష్ఠు నివారణ అధికారి నాగరాజు చేతుల మీదుగా వీటిని రోగులకు అందజేశారు. అనంతరం క్యాన్సర్ పేషంట్ వీసం నాగరాజుకు రూ.5 వేలు, పక్షవాతంతో బాధపడుతున్న తాళపర్తి అమెరికాకు రూ.3 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా సంస్థ గన్నవరం శాఖ చైర్మన్ మదుపల్లి బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ అపన్నులకు మానవత సేవా సంస్థ అండగా నిలుస్తుందన్నారు. విద్య, వైద్య పరంగా రోగులకు తమవంతు తోడ్పాటు నందిస్తున్నట్లు చెప్పారు. సంస్థ కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, కార్యదర్శి వీవీ.కృష్ణమోహన్, గౌరవ సలహాదారులు ముక్కామల సుబ్బారావు, ఉపాధ్యక్షులు పువ్వల ఆదినారాయణ, సంయుక్త కార్యదర్శి వడ్లమూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరంభంలోనే సెరిబ్రల్ పాల్సీకి చికిత్సతో మేలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ సెరిబ్రల్ పాల్సీపై అవగాహన పెంచుకోవడంతో పాటు ఆరంభంలోనే సరైన చికిత్స అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని 'చేయూత మానసిక దివ్యాంగుల శిక్షణ సంస్థ' ప్రిన్సిపాల్, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ టి.కృష్ణకుమారి పేర్కొన్నారు. ప్రపంచ సెరిబ్రల్ పాల్సీడే పురస్కరించుకుని సోమవారం నూజివీడు రోడ్డులో చేయూత సంస్థ ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెరిబ్రల్ పాల్సీ అంటే మస్తిష్క పక్షపాతం లాంటిదన్నారు. సెరిబ్రల్ పాల్సీ ఉన్న పిల్లలు కదలికలు, మాట్లాడటం, తాగడం తదితర విషయాల్లో ఇబ్బందులు పడతారన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ఎప్పటికప్పుడు గమనించాలని.. ఏమైనా అనుమానం ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం ప్రత్యేక చిన్నారులు ప్లకార్డులు చేతబూని ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక చిన్నారులు పాల్గొన్నారు.

అంతా తూతూమంత్రం

- రోడ్డు మరమ్మతు పనుల్లో డొల్లతనం
- రూ.40 లక్షలతో చేపట్టిన కంకిపాడు- గన్నవరం రోడ్డు అస్తవ్యస్తం
- మళ్లీ ధ్వంసం అవుతున్న రోడ్డు మార్గం
- పనుల్లో లోపాలే కారణమంటూ ఆరోపణలు



మరమ్మతులు చేసిన ప్రాంతంలో ధ్వంసం అవుతున్నరోడ్డు



రోడ్డు మరమ్మతులు చేసినా గుంతలు ఇలా....

కంకిపాడు: అంతా తూతూమంత్రమే.. చేసిన పనుల్లో నాణ్యతే లేదు.. అంతా డొల్లే.. లక్షలు వెచ్చించి పూర్తి చేసిన రోడ్డు మళ్లీ యథాస్థితికి చేరుతోంది. దీనికి రోడ్డు నిర్మాణ పనుల్లో డొల్లతనమే కారణమంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డు ప్రాధాన్యత ఇదీ..

ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో ఉన్న కంకిపాడు- గన్నవరం రోడ్డు మార్గం విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారికి అనుబంధంగా ఉంటుంది. ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు, ఏలూరురోడ్డు మార్గానికి చేరుకునేందుకు అధిక శాతం మంది ప్రజానీకం ఈ రోడ్డు మార్గాన్ని రాకపోకలకు వినియోగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత గల రోడ్డు మార్గం గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. కురుస్తున్న వర్షాలకు రోడ్డు పూర్తిగా చెరువును తలపిస్తూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా కంకిపాడు అండర్‌పాస్, ఉప్పలూరు ప్రధాన సెంటర్లలో రోడ్డు పల్లంగా ఉండటంతో నీరు నిలిచి రాకపోకలు సాగక వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉండేవి.

రూ.40 లక్షలతో..

ఆర్అండ్‌బీ అధికారులు యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వానికి నివేదించారు. ఈ నివేదికల ఆధారంగా కూటమి సర్కారు రూ.40 లక్షలు గ్రాంటు విడుదల చేసింది.

రోడ్డు మరమ్మతులు మూణ్ణాళ్ల ముచ్చటే..

ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేతులమీదుగా రోడ్డు మరమ్మతు పనులకు ఇటీవల శంకుస్థాపన చేశారు. ఉప్పలూరు పరిధిలోని బుడమేరు వంతెన సమీపం వరకూ రోడ్డు మరమ్మతులు పూర్తి చేశారు. అది కూడా అంతా తూతూమంత్రంగా సాగింది. చాలా చోట్ల గుంతలను వదిలేశారు. రోడ్డు మరమ్మతులు చేశామని అనిపించి చేతులు దులుపుకున్నారు. దీంతో భారీ వాహనాల రాకపోకలతో ఆ గుంతలు మరింత పెద్దవిగా తయారై రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితి. ఇక రోడ్డు మరమ్మతుల విషయానికొస్తే నాణ్యతా లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రోడ్డు మరమ్మతులు పూర్తి చేసిన చాలా ప్రాంతాల్లో రోడ్డు ధ్వంసమై రాళ్లు తేలుతున్నాయి. రోడ్డు ధ్వంసమై తిరిగి రోడ్డు మార్గం యథాస్థితికి చేరుతోంది. కంటి తుడుపు చర్యగా రోడ్డు మరమ్మతులు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా చేపట్టిన నిర్మాణ పనులపై శాఖాపరమైన పర్యవేక్షణ కొరవడటంతో నిర్మాణ పనులు నాణ్యత లేకుండా అస్తవ్యస్తంగా సాగాయన్న విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అభివృద్ధిపై చేస్తున్న ప్రచారానికి, వాస్తవానికి పొంతనే లేదంటూ పలువురు విమర్శిస్తున్నారు. రోడ్డు మరమ్మతుల్లో ఎవరికి వారు నాలుగు రాళ్లు వెనకేసుకోవటంతోనే రోడ్డు అధ్వానంగా తయారైందంటూ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఘనంగా గంగానమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



గంగానమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని గ్రామదేవత శ్రీగంగానమ్మ తల్లి దేవస్థానం 9వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారితో పాటుగా ఆలయాన్ని రకరకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. గంగానమ్మతో పాటుగా పరివార దేవతలైన వినాయకుడు, సుబ్రహ్మణేశ్వర స్వామి, కాల భైరవుడు, పోతురాజు స్వామివార్లకు ఆలయ అర్చకులు శ్యామ్ నేతృత్వంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పుట్టి కోటేశ్వరరావు, నండూరు సత్యవెంకటేశ్వరశర్మ, సక్కా బాబు, పుట్టి రాంబాబు, రాజులపాటి శ్రీను, సీతమ్మ, ఆలయ యువ భక్తుల కమిటీ సభ్యులు పుటి వంశీకృష్ణ, పల్లపోతు జాన్ ప్రకాష్, జెట్టి ప్రతాప్, పల్నాటి తేజ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వార్డుల విభజనకు గ్రీన్‌సిగ్నల్

- ఉయ్యూరు మున్సిపాలిటీలో పెరగనున్న వార్డులు
- నేడు కౌన్సిల్ ముందుకు పునర్విభజన అంశం



ఉయ్యూరు మున్సిపల్ కార్యాలయం



ఉయ్యూరు పట్టణం

ఉయ్యూరు: ఉయ్యూరు మున్సిపాలిటీలో ఎన్నికల వేడి రాజుకుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియకు అంతా సిద్ధం చేయాలన్న ఆదేశాల నేపథ్యంలో అధికారులు ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. నగర పంచాయతీగా ఉన్న ఉయ్యూరు గ్రేడ్- 2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అవ్వటంతో వార్డుల పునర్విభజన అంశం తెరపైకి వచ్చింది. మున్సిపల్ శాఖ ఉత్తర్వుల మేరకు టౌన్ అండ్ ప్లానింగ్ అధికారులు వార్డుల పునర్విభజన పనుల్లో నిమగ్నమయ్యారు. తాజా విభజనతో గతంలో 20 వార్డులుగా ఉన్న మున్సిపాలిటీ 29 వార్డులకు పెరిగే అవకాశం ఉంది.

మారనున్న వార్డుల స్వరూపం

ఉయ్యూరు మున్సిపాలిటీలో 20 వార్డులు ఉన్నాయి. 31,996 మంది ఓటర్లు ఉన్నారు. పునర్విభజనతో వార్డుల స్వరూపంతో పాటు ఓటర్ల సంఖ్య కూడా మారనుంది. మొత్తం ఓటర్లు 32,801 మందికి చేరారు. కాగా వార్డుల సంఖ్య 29కి పెరిగేలా వార్డులను క్రమపద్ధతిలో విభజిస్తూ వస్తున్నారు. తాజా వార్డుల పునర్విభజనతో గతంలో ఉన్న వార్డుల స్వరూపం పూర్తిగా మారనుంది.

నేడు కౌన్సిల్ ముందుకు

వార్డుల పునర్విభజన అంశం కౌన్సిల్ ముందుకు రానుంది. మున్సిపల్ కౌన్సిల్ హాలులో ప్రత్యేక సమావేశం ఈనెల 7వ తేదీన మంగళవారం నిర్వహించనున్నారు. ప్రభుత్వ ఆదేశాలు, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వార్డుల పునర్విభజన, పలు అభివృద్ధి అంశాలు కౌన్సిల్ ముందుకు తేనున్నట్లు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ తెలిపారు. సభ్యులందరి ఆమోదంతో అందరికీ అనువుగా ఉండేలా వార్డుల విభజన ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వినతి

గన్నవరం: నియోజకవర్గంలోని చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారిపై రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఎన్‌హెచ్‌ఏఐకు లేఖ రాశారు. గత కొన్ని రోజులుగా నియోజకవర్గంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రామవరప్పాడు నుంచి బాపులపాడు మండలం బొమ్ములూరు వరకు ఎలక్ట్రికల్స్ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. క్షతగాత్రులకు అత్యవసర చికిత్స అందించేందుకు కనీసం రెండు లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. రోడ్డు ప్రమాద బాధితులకు సత్వరమే ఉచితంగా అత్యాధునికమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ



గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఖోఖో క్రీడాకారులకు విశ్రాంత జీవశాస్త్ర ఉపాధ్యాయులు పి.శేషగిరిరావు రూ.10 వేలు విలువైన క్రీడా దుస్తులను బహూకరించారు. వీటిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ.సునీల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ పాఠశాల క్రీడా సమాఖ్య పోటీల్లో పాల్గొనే విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకురావడం అభినందనీయమన్నారు. వీరి సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని లక్ష్యం దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. వ్యాయామోపాధ్యాయులు డి.నాగరాజు, ఎస్‌కె.మీరాసాహెబ్, క్రీడా ప్రతినిధులు ఎం. నరేంద్ర, ఎస్.అశోక్ పాల్గొన్నారు.

తాడిగడపకు స్వచ్ఛాంధ్ర అవార్డు ప్రదానం



మంత్రి శుభాష్, కలెక్టర్ బాలాజీ నుంచి అవార్డు తీసుకుంటున్న కమిషనర్ నజీర్



ఉత్తమ స్వచ్ఛ వారియర్ అవార్డు స్వీకరిస్తున్న రమణ

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీకి స్వచ్ఛాంధ్ర అవార్డు-2025ను ప్రదానం చేశారు. మచిలీపట్నంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి శుభాష్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అవార్డును తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ షేక్ నజీర్‌కు ప్రదానం చేశారు. ఉత్తమ స్వచ్ఛ వారియర్ అవార్డును యనమలకుదురు 4వ సచివాలయానికి చెందిన బత్తుల రమణకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

అడుగుకో గుంతతో ప్రయాణికుల అవస్థలు



ఏలూరు కాలువ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై భారీగా పడిన గుంతలు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం శివారు ఏలూరు కాలువ వద్ద ఆర్అండ్‌బీ రహదారి పూర్తిగా గోతుల మయంగా మారింది. రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంతో ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గన్నవరం- పుట్టగుంట ఆర్అండ్‌బీ రోడ్డును మూడేళ్ల క్రితం రెండు లైన్లుగా విస్తరించారు. అయితే విమానాశ్రయ భూసేకరణలో ఉండడం కారణంగా ఏలూరు కాలువ వద్ద అర కిలోమీటర్ పొడవునా రహదారిని అభివృద్ధి చేయకుండా వదిలివేశారు. కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో ఈ ప్రాంతంలో రహదారి క్రమంగా దెబ్బతింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై కంకర తేలిపోయి పలు చోట్ల భారీగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో గుంతల్లో పడి వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళలో అయితే ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల వెంట వ్యర్థాలు.. రోగాలకు కారకాలు



ముస్తాబాదలో రోడ్డు వెంట చెత్త, వ్యర్థాలు

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో చెత్త, వ్యర్థాలతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. స్థానిక హైస్కూల్ సమీపంలో సూరంపల్లి రహదారి వెంట గ్రామంలోని చెత్తను డంప్ చేయడంతో ఈ ప్రాంతం డంపింగ్ కేంద్రంగా మారింది. ముస్తాబాద, సూరంపల్లి గ్రామస్తులు నిరంతరం రాకపోకలు కొనసాగించే ఈ రహదారి వెంట చెత్త పడవేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డంపింగ్ యార్డులు లేకపోవడంతో వ్యర్థాలతో రోగాలు ప్రబలుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముస్తాబాద పెద చెరువు కళింగ వెంట ఈ చెత్తను డంపింగ్ చేస్తుండటంతో రైతులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మానసిక సమస్యలకు పౌష్టికాహారం అవసరం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ రమేష్

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు మానసిక సమస్యలకు సమతుల్య ఆహారం తీసుకోవాలని జిల్లా మెంటల్ హెల్త్ కౌన్సిలర్ రమేష్ అన్నారు. సోమవారం నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏపీ సమగ్ర శిక్ష రాష్ట్ర గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఆదేశాల మేరకు 8, 9 తరగతి విద్యార్థులకు మానసిక ఆరోగ్యం- ఆహారపు అలవాట్లు అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా మెంటల్ హెల్త్ కౌన్సిలర్ రమేష్ మాట్లాడుతూ మానసిక సమస్యలకు ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, ఒమెగా ఫ్యాటీ ఆసిడ్స్ మొదలైనవి ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు రవి ప్రసాద్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంతో మంచి అలవాట్లు అలవర్చుకోవచ్చన్నారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. టీచర్ నళినీరామ్ మాట్లాడుతూ విద్యార్థులకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా అవసరమన్నారు. ఉపాధ్యాయులు గోపినాథ్, శివలక్ష్మి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వారిపై దాడి చేసిన యువకులపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అల్లీనగర్ మసీదు వీధిలో షేక్.మహబులి కుటుంబం నివాసం ఉంటోంది. ఆదివారం రాత్రి మహబులి, తన బావ షేక్ ఖాజాతో కలిసి బయటకు పని మీద వెళ్లారు. ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో బంధువుల అమ్మాయి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా, ఎక్కడికి అని ఆరా తీశారు. అదే క్రమంలో రోడ్డుపై నిల్చుని ఉన్న కొంత మంది యువకులు మహబులిని అడ్డగించి, ముఖంపై సిగరెట్ పొగ వదిలి దాడికి పాల్పడ్డారు. దీంతో మహబులి, ఖాజాలకు గాయాలు కావడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమపై షాబాషీ, సోను, రహ్మతుల్లాతో పాటు మరి కొందరు దాడికి చేసినట్లు బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటల పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈఓ దుర్గాసాగర్



బాపులపాడు జెడ్పీ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లు

ఉయ్యూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉయ్యూరు మండల స్థాయి క్రీడా జట్ల ఎంపిక పట్టణంలోని జెడ్పీ పాఠశాలలో సోమవారం ప్రారంభమైంది. ఎంఈఓ దుర్గాసాగర్ పోటీలను ప్రారంభించారు. వాలీబాల్ అండర్-14, 17 విభాగాల్లో తొలి రోజు పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ ఆరేపల్లి సాయి, కోఆర్డినేటర్ కె.బాలస్వామి పాల్గొని పర్యవేక్షించారు.

నేటి నుంచి ఆటల పోటీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండల స్థాయి ఆటల పోటీలు ఈ నెల 7,8 తేదీల్లో నిర్వహించనున్నట్లు మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జి బీఎస్ రామచంద్రుడు తెలిపారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ ఆటల పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లను సోమవారం ఆయన పర్యవేక్షించారు. అండర్-14, అండర్- 17 కేటగిరిల్లో బాలురు, బాలికల జట్లకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు రామచంద్రుడు చెప్పారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం, యోగా, అథెటిక్స్ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి పలు జట్లు ఈ పోటీలకు హాజరుకానున్నాయన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను ఎంపిక చేస్తామని, వీరంతా త్వరలో జరగబోయే డివిజనల్ స్థాయి ఆటల పోటీలకు బాపులపాడు మండల జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. బాపులపాడు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్, ఇతర వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.


సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి అమానుషం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై మతోన్మాదుల దాడి అమానుషమని సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ విమర్శించారు. బందరురోడ్డులోని రాఘవయ్య పార్కు వద్ద సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గవాయ్‌పై దాడికి నిరసనగా ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.వి.కృష్ణ మాట్లాడుతూ దేశంలో మతోన్మాదులు ఆగడాలు పెరిగిపోతున్నాయన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే దాడికి తెగబడేంత ధైర్యం చేశారని, పరిస్థితులు ఇలాగే ఉంటే ప్రజాస్వామ్యానికి రక్షణ ఏముంటుందని ప్రశ్నించారు. ఇలాంటి దాడులను అందరూ ఖండించాలని కోరారు. సనాతన ధర్మం పేరుతో ఎవరిపైబడితే వారిపై దాడి చేయడం శోచనీయమన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ మతోన్మాదుల ఉన్మాద చర్యలు పెరిగిపోతున్నాయని, అడ్డూ అదుపు లేకుండా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు మైనారిటీలు, దళితులను టార్గెట్ చేసిన వారు నేరుగా ఇప్పుడు సుప్రీంకోర్టునే ప్రశ్నిస్తున్నారన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి.సుబ్బారావు, కె.ధనలక్ష్మి, నిర్మల, వి.కృష్ణయ్య, వై.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

స్టెల్లాలో ఆకట్టుకున్న ఎథ్నిక్ షో



పటమట(విజయవాడతూర్పు): పెరుగుతున్న నాగరికతతో సంప్రదాయాలు మారుతున్నాయని, ప్రతి ఒక్కరూ తమ సంప్రదాయాలను తెలుసుకుని వాటిని ఆచరించాలని స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్ అన్నారు. స్టెల్లా కళాశాలలో జరుగుతున్న కల్చరల్ వీక్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కళాశాల ఆడిటోరియంలో ఎథ్నిక్‌వేర్ షో జరిగింది. కార్యక్రమంలో పలువురు విద్యార్థినులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సంప్రదాయ దుస్తులను ధరించి ప్రదర్శించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి దియాపాటిల్, రెండో బహుమతి ప్రసన్న రేణుక, మూడో బహుమతి అస్మిత దక్కించుకున్నారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా చరిత్ర విభాగాధిపతి డాక్టర్ బ్యూలా, ఎంబీఏ విభాగాధిపతి నాగసుందరి వ్యవహరించగా అధ్యాపకులు స్వరూపారాణి, సారా కుమారి పర్యవేక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.